క్లుప్తంగా

ఘనంగా అమ్మవారి అనుపు ఉత్సవం



నిమజ్జనానికి తరలిస్తున్న అమ్మవారి విగ్రహం

మధురవాడ: అమ్మవారి అనుపు ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారంతోనే ముగిసినప్పటికీ ఆ రోజు అనుపునకు మంచిరోజు కాకపోవడంతో, పలుప్రాంతాల్లో శనివారం నిమజ్జనాలు నిర్వహించారు. రేవళ్లపాలెం శ్రీ సాయి సూర్య రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌తో పాటు ఇతర ప్రాంతాలు, గేటెడ్ కమ్యూనిటీలు, మండపాల్లో కొలువుదీరిన అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గణేష్‌నగర్ ఏఎస్ఆర్ నగర్‌లోని శ్రీ విజయ గణపతి పంచాయతన దేవాలయంలో నిర్వహించిన ఉత్సవాల్లో కోలాటాలు, తీన్ మార్‌తో భారీగా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

9 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

తగరపువలస: విశాఖ జిల్లా జాలారిపల్లిపాలెం గంగవరం కబడ్డీ గ్రౌండ్‌లో ఈ నెల 9 నుంచి 11 వరకు రాష్ట్ర స్థాయి పురుషుల ఆహ్వాన కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా కబడ్డీ అసోషియేషన్ కార్యదర్శి జె.వి.ఎస్.ప్రసాదరెడ్డి తెలిపారు. శనివారం ఆయన చిట్టివలసలో మాట్లాడుతూ జె.పి.ఎం.స్పోర్ట్స్ క్లబ్ 19వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి అనుమతితో విశాఖ జిల్లా కబడ్డీ సంఘం పర్యవేక్షణలో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రబ్బర్ మ్యాట్లపై నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లా పురుషుల కబడ్డీ జట్లు పాల్గొంటాయన్నారు. ఈ పోటీలలో విజయం సాధించే నాలుగు జట్లకు జీవీఎంసీ 64వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ధర్మాల శ్రీను, ఇతర దాతల సాయంతో జె.పి.ఎం.స్పోర్ట్స్ క్లబ్ నగదు బహుమతులు ప్రకటించిందన్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.35 వేలు, మూడవ బహుమతి రూ.25 వేలు, నాలుగో బహుమతి కింద రూ.15 వేలు ఇవ్వనున్నట్టు ప్రసాదరెడ్డి ప్రకటించారు.

బాణసంచా తయారీదారుల అరెస్ట్

తగరపువలస: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు వేర్వేరు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచా తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.20 వేల విలువైన బాణసంచా మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిలో మండలంలోని దిబ్బడపాలెం గ్రామానికి చెందిన దాసరి గురయ్య(55), శొంఠ్యాం పంచాయతీ ఎస్సీ బీసీ కాలనీకి చెందిన చల్లా గురమ్మ(40), పెద్దిపాలెం పంచాయతీ అప్పన్న కాలనీకి చెందిన రొంగలి అచ్చిబాబు(42) ఉన్నారు. వీరంతా ముడిసరుకులు తీసుకువచ్చి నివాసాల మధ్య తారాజువ్వలు, బాంబులు, చిచ్చుబుడ్లు, తాటిరేకుల బాంబులు తయారు చేస్తున్నట్టు గుర్తించామని సీఐ వాసునాయుడు తెలిపారు.

ఎండాడలోనే భవన నిర్మాణం చేపట్టాలి

దాబాగార్డెన్స్: యాదవ సామాజిక వర్గానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండాడలో కేటాయించిన స్థలంలోనే యాదవ సంఘం భవన నిర్మాణం చేపట్టాలని జాతీయ యాదవ ఐక్యవేదిక అధ్యక్షుడు అల్లి అప్పలనారాయణ కోరారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఐక్యవేదిక ప్రతినిధులు దాసు మోహనరావు, అల్లు రమణతో కలిసి మాట్లాడారు. యాదవ సామాజిక వర్గానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంఘ భవనానికి జీవో జారీ చేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ జీవోని రద్దు చేసి స్థలం మార్పునకు ప్రయత్నిస్తుందన్నారు. దీనివల్ల యాదవ సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని, తక్షణమే కూటమి ప్రభుత్వం తన ఆలోచనను ఉపసంహరించుకోవాలన్నారు. యాదవులు అభివృద్ధి చెందాలంటే సంఘ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గ శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ప్రసాద్, యాదవ సంఘం మహిళా నాయకురాలు అనుపమ, డొక్కర అప్పారావు, జోగ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని గాలికొదిలేశారు



పద్మనాభం శాఖా గ్రంథాలయం



గ్రంథాలయంలో చదువుకుంటున్న నిరుద్యోగులు



తాళం వేసి ఉన్న పుస్తకాల గది

- ఏడాదిన్నరగా లైబ్రేరియన్ పోస్ట్ ఖాళీ
- వారంలో ఒక్కరోజే ఇన్‌చార్జి లైబ్రేరియన్ సేవలు
- మిగతా రోజుల్లో స్వీపరే దిక్కు
- పుస్తకాల గదికి తాళాలు
- నిరుద్యోగులకు తప్పని అవస్థలు



విరిగిపోయిన మరుగుదొడ్డి తలుపు

పద్మనాభం: పద్మనాభం శాఖా గ్రంథాలయ నిర్వహణను గాలికి వదిలేశారు. ఇక్కడ పని చేసిన లైబ్రేరియన్ గతేడాది మే నెలలో రిటైరవగా.. ఏడాదిన్నర నుంచి స్వీపర్ పర్యవేక్షణలోనే నడుస్తుంది. మండలంలోని 22 పంచాయతీలకు ఇదొక్కటే గ్రంథాలయం. ఇక్కడ సుమారు ఏడు వేల పుస్తకాలు ఉన్నాయి. వీటిలో 1500 కాంపిటీటివ్ పుస్తకాలు కాగా, మిగతావి నవలలు. ఐదు దిన పత్రికలు వస్తాయి. మండలానికి ఒకే గ్రంథాలయం కావడంతో పాఠకులు, చందాదారులు, నిరుద్యోగులు ఎక్కువగా వస్తుంటారు. ఉద్యోగార్థులు పోలీస్, గ్రూప్–2, డీఎస్సీ తదితర పరీక్షలకు ప్రిపేర్ అవుతూ ఉంటారు. రెడ్డిపల్లితో పాటు రేవిడిలోనూ బుక్ డిపాజిట్ సెంటర్లు మాత్రం ఉన్నాయి. వీటికి పేపర్లతో పాటు 15 రోజులకోసారి మ్యాగజైన్లు, నవలలు సరఫరా చేస్తారు. పోటీ పరీక్షల పుస్తకాలు సరఫరా చేయరు.

స్వీపర్ పర్యవేక్షణలోనే..

ఇక్కడ పనిచేసే లైబ్రేరియన్ గతేడాది మే నెలలో రిటైరయ్యారు. ఇప్పటికి దాదాపు ఏడాదిన్నర కావస్తోంది. అప్పటి నుంచి ఈ గ్రంథాలయానికి పూర్తి స్థాయి లైబ్రేరియన్ లేరు. వారానికోసారి బుధవారం మాత్రమే అనందపురం లైబ్రేరియన్ పద్మనాభం శాఖా గ్రంథాలయానికి వస్తారు. మిగతా రోజుల్లో స్వీపర్ పర్యవేక్షణలో గ్రంథాలయం నడుస్తుంది. లైబ్రేరియన్ వచ్చినప్పుడు మాత్రమే చందాదారులు తమ కావలసిన నవలలు, నిరుద్యోగులు అవసరమైన కాంపిటీటివ్ పుస్తకాలు **తీసుకుంటారు. మిగతా రోజుల్లో లైబ్రేరియన్ లేకపోవడంతో పుస్తకాలు, పాత పేపర్లు ఉన్న గదికి తాళం వేస్తారు. దీనివల్ల నవలలు కోసం వచ్చే చందాదారులకు వాటిని తీసుకునే వీలు ఉండటం లేదు. నిరుద్యోగులు తమ సందేహాలు నివృత్తి చేసు**కునేందుకు పుస్తకాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. తమకు అవసరమైన సమాచారం పొందడానికి పాత పేపర్లు అందుబాటులో లేక పాఠకులకూ అవస్థలు తప్పడం లేదు. చదువుకునే గది చిన్నది కావడంతో, పాఠకులకు సరిపోవడం లేదు.

వసతుల లేమి

లైబ్రరీలో మరుగుదొడ్డి తలుపు విరిగిపోయి ఆరు నెలలు కావస్తోంది. తలుపు లేకపోవడంతో పాఠకులు, ముఖ్యంగా మహిళలు ఇబ్బంది పడుతున్నారు. సుమారు రూ.5.50 లక్షలతో గ్రంథాలయానికి ఏడాదిన్నర క్రితం మరమ్మతులు చేపట్టి రంగులు వేశారు. మరమ్మతులు చేపట్టినప్పటికీ శ్లాబ్ నుంచి గోడల మీదుగా వర్షాలకు నీరు కారిపోతుంది. దీని వల్ల పాత పేపర్లు తడిసిపోతున్నాయి. రీడింగ్ రూంలో ఫ్యాన్లు కాలిపోయినా వేయలేని పరిస్థితి. వీటి స్థానంలో ఇద్దరు దాతలు ఇచ్చిన రెండు ఫ్యాన్‌లను అమర్చారు.



తాళం వేసి ఉన్న లైబ్రేరియన్ గది

పూర్తి స్థాయి లైబ్రేరియన్‌ను నియమించాలి



ఈ లైబ్రరీకి ఏడాదిన్నరగా పూర్తి స్థాయి లైబ్రేరియన్ లేరు. వారానికోసారి ఇన్‌చార్జి లైబ్రేరియన్ వచ్చినప్పుడే కాంపిటీటివ్ పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. మిగతా రోజుల్లో కాంపిటీటివ్ పుస్తకాలున్న గదికి తాళం వేసి ఉంటుంది. దీంతో కాంపిటీటివ్ పుస్తకాలు ఉన్నా, తీసుకుని చదువుకోలేని పరిస్థితి. పూర్తి స్థాయి లైబ్రేరియన్‌ను నియమించాలి.

– సి.హెచ్.ప్రసాద్, పాఠకుడు

టాయిలెట్ డోర్ లేక ఇబ్బంది



గ్రంథాలయం మరుగుదొడ్డి తలుపు విరిగిపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. అత్యవసరమైతే మల, మూత్ర విసర్జనకు దూరంగా వెళ్లాల్సి వస్తోంది. ఆరు నెలలుగా ఇదే పరిస్థితి. వెంటనే తలుపు బిగించి, టాయిలెట్ అందుబాటులోకి తీసుకురావాలి.

– ఆర్.మణికంఠ, పాఠకుడు

బబ్బేలమ్మ ఆలయం వద్ద అన్న సమారాధన



అన్నప్రసాదం స్వీకరిస్తున్న ప్రజలు

పీఎం పాలెం: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం మధ్యాహ్నం కారుషెడ్ బబ్బేలమ్మ అలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. మహిళలకు, పురుషులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అన్నప్రసాదం వడ్డించారు. పీఎం పాలెం, గాయత్రీ నగర్, పిలకవానిపాలెం తదితర ప్రాంతాలకు చెందిన వేలాదిమంది ప్రజలు బారులు తీరి, అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఆర్ఎస్ఎస్' మార్చ్‌పాస్ట్



మజ్జివలసలో మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

తగరపువలస: రాష్ట్రీయ స్వయం సేవక్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యకర్తలు భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీ నుంచి మజ్జివలస వరకు వీధులలో శనివారం మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ బెంగళూరు సంచాలకుడు భాస్కర్, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు, సర్పంచ్ జీవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు ఆర్ఎస్ఎస్ గురించి వివరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ దుర్మరణం

తగరపువలస: కొమ్మాదికి చెందిన కంపా సన్యాసమ్మ(36) అనే వివాహిత శనివారం మధ్యాహ్నం ఆనందపురం మండలం పెద్దిపాలెం జాతీయరహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని దుర్మరణం చెందింది. మృతురాలి భర్త రామసూరి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉదయం భోగాపురంలోని పుట్టింటికి అని చెప్పి వెళ్లిన ఆమె తిరిగి వచ్చే క్రమంలో ఈ ప్రమాదానికి గురైంది. ఆనందపురం సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ జి.సంతోష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరి పైరుకు సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



తెగుళ్లు సోకిన వరి

పద్మనాభం: వరి పంటకు సుడి దోమ ఆశించినందున సస్య రక్షణ చర్యలు చేపట్టాలని భీమిలి సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయ ప్రసాద్, అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం కీటక శాస్త్రవేత్త ఆర్.సరిత సూచించారు. భీమునిపట్నం డివిజన్‌లో ఆనందపురం, పద్మనాభం, భీమునిపట్నం మండలాల్లో వరి పంటను సుడి దోమ ఆశించిందని తెలిపారు. సుడి దోమలు గుంపులుగా దుబ్బుల అడుగు భాగంలో చేరి రసం పీల్చేయడం వల్ల ఆకులు క్రమేపీ ఎండిపోతాయన్నారు. ఒక దుబ్బు నుంచి పక్క దుబ్బులకు వ్యాప్తి చెంది, పొలం సుడులు సుడులుగా ఎండిపోతుందని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సుడి దోమ ప్రభావం ఇంకా ఉధృతంగా వ్యాపించే అవకాశముందని, దీని నివారణకు పొలంలో ప్రతి రెండు మీటర్లకు తూర్పు పడమరలగా కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నీరు అధికంగా ఉన్నట్లయితే, బయటికి పంపించి ఆరబెట్టాలని వివరించారు. మళ్లీ కొత్తగా నీరు పెట్టుకోవాలని తెలిపారు. దోమ ఉధృతి తక్కువగా ఉన్నప్పుడు ఎసిపేట్ మూడు వందల గ్రాములు రెండు వందల నీటర్లతో కలిపి ఎకరం విస్తీర్ణానికి పిచికారి చేయలన్నారు. ఎక్కువగా ఉంటే ట్రైఫ్లూ మీజో పైరిం 0.48 గ్రాములు లీటరు నీటికి కలిపి రెండు వందల లీటర్ల ద్రావణాన్ని పిచికారి చేయాలని తెలిపారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచించారు.

గుల్లబారుతున్న రోడ్లు

ఫోకస్

జీవీఎంసీ 5వ వార్డు ఆర్‌జీకే కాలనీలో రోడ్లు, బ్లాకుల వద్ద బేస్‌మెంట్‌ను పందికొక్కులు, పందులు, కుక్కలు తొలిచేయడంతో ప్రమాదకరంగా మారాయి. 103వ బ్లాక్, పాత కాలనీల వద్ద ప్రమాదానికి దారులు తెరచినట్టు గుహల్లా, లోతుగా ఉన్నాయి. సీసీ రోడ్డు కింద మట్టినంతా తొలిచేయడంతో అక్కడంతా గుల్లగా మారిపోయింది. దీంతో అధిక బరువుతో ఏ వాహనం వెళ్లినా కూలిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– మధురవాడ



ఆర్‌జీకే కాలనీ పాత కాలనీ బ్లాకు వద్ద కూలడానికి సిద్ధంగా ఉన్న సీసీ రోడ్డు



ఆర్‌జీకే కాలనీ 103వ బ్లాకు వద్ద ఇలా..

కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

భీమునిపట్నం: భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేదలకు కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. ఇటీవల నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఎంపిక చేసిన 34 మందికి కీతిన్‌పేట సన్‌స్కూల్ వద్ద కళ్ల అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు, సభ్యులు వెంపాడ శ్రీనివాసరెడ్డి, ముసునూరి సూర్య శ్రీనివాసరావు, రాజేటి బసవ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గీతంలో వైట్‌కోట్ ధారణ ఉత్సవం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాధికారెడ్డి

కొమ్మాది: గీతం వైద్య కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు వైట్‌కోట్ ధారణ ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎన్‌టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి మాట్లాడుతూ వైద్య రంగంలో ఎన్నో గణనీయమైన మార్పులు వస్తున్నాయని, దానికి అనుగుణంగా చదవాలని సూచించారు. విద్యార్థులు మెలకువలతో కూడిన చికిత్స అందించే పద్ధతులను నేర్చుకుని, సేవా గుణంతో వైద్య సేవలను అందించాలని కోరారు.

'పోతిన'కు చిన్నశ్రీను అభినందనలు



హనుమంతురావును అభినందిస్తున్న భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిన్న శ్రీను తదితరులు

మధురవాడ: వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ)సభ్యుడిగా నియమితులైన పోతిన హనుమంతురావును ఆ పార్టీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), ఇతర నాయకులు అభినందించారు. హనుమంతురావుతో పాటు మధురవాడ జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల నాయకులు చిన్న శ్రీనును విజయనగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ నగరాలు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, 8వ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, వివిధ విభాగాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శివాలయ ప్రాంగణంలో షాపుల నిర్మాణం

దేవదాయశాఖ అనుమతుల్లేకుండా నిర్మించడంపై విమర్శలు



నిర్మాణంలో ఉన్న షాపులు

భీమునిపట్నం: భీమిలిలోని పురాతన శివకేశవ ఆలయాల ప్రాంగణంలో సరైన అనుమతులు లేకుండా షాపుల నిర్మాణం చేపట్టడంపై విమర్శలు వస్తున్నాయి. గతంలో ఈ ఆలయం ప్రాంగణంలో అర్చకుల నివాసాలు, వాటి పక్కన చిన్న షాపులు ఉండేవి. ఇవి దేవదాయ శాఖ ఆధీనంలో ఉండేవి. అయితే, ఇక్కడి నివాసాలు శిథిలమవుతుండటంతో, ఇక్కడ నివసిస్తున్న అర్చకుల కుటుంబాలు రెండేళ్ల క్రితం ఖాళీ చేసి, అద్దె నివాసాల్లో ఉంటున్నాయి.

ఇటీవల ఇక్కడ ప్రాంగణంలో ఆలయాల ట్రస్టీ, ఎగ్జిక్యూటివ్ అథారిటీ ఆర్.సింగరాచార్యులు శిథిలమైన నివాసాలను తొలగించి, వాటి స్థానంలో షాపుల నిర్మాణం చేపట్టడం విమర్శలకు తావిస్తోంది. నిబంధనల ప్రకారం ఇక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టాలన్నా దేవదాయశాఖ అనుమతులు తప్పనిసరి. ఆ స్థలంలో మళ్లీ అర్చకుల నివాసాలను నిర్మించవలసి ఉండగా, షాపుల నిర్మాణం ఎలా చేస్తారని పలువురు భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ షాపుల నిర్మాణం కూడా కొందరు ప్రైవేటు వ్యక్తుల సహకారంతో నిర్మిస్తుండటం, వాటికి ఎటువంటి అనుమతులూ లేకపోవడం విమర్శలకు దారి తీసింది. ముఖ్యంగా ఇక్కడ నిర్మాణాలు చేపట్టినప్పుడు భక్తులందరికీ తెలియపరచడం, విలేకరుల సమావేశం నిర్వహించి తమకు ఏ మేరకు అనుమతులు ఉన్నాయో వెల్లడించాలని.. కానీ అలా చేయకుండా నేరుగా నిర్మాణాలు చేపట్టడమేంటని మరికొందరు అంటున్నారు.

నిబంధనల ప్రకారమే నిర్మాణం

ఈ విషయంపై ఎగ్జిక్యూటివ్ అథారిటీ సింగరాచార్యుల వద్ద ప్రస్తావించగా తాము నిబంధనలకు అనుగుణంగానే షాపుల నిర్మాణం చేపట్టామని, ఎక్కడా తప్పు చేయలేదని తెలిపారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

మేం ఆలయ ప్రాంగణంలో ఎటువంటి షాపుల నిర్మాణానికి అనుమతులు ఇవ్వలేదు. అక్కడ ఏమేరకు షాపులు నిర్మాణాలు జరుగుతున్నాయో పరిశీలించి, చర్యలు తీసుకుంటాం.

– అన్నపూర్ణ, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్

జూ కిటకిట



నీటిఏనుగుకు ఫొటోలు తీస్తున్న సందర్శకులు



సీతాకోక చిలుకల పార్కు వద్ద సందర్శకుల సందడి



తెల్ల పులిని చూస్తున్న సందర్శకులు



జూలో పెద్ద పులుల ఎన్‌క్లోజర్ వద్ద సందర్శకులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు శనివారం సందర్శకులతో కిటకిటలాడింది. కుటుంబాలతో సహా జూ పార్కును సందర్శించి.. ఇక్కడి వన్యప్రాణులను తిలకించారు. తెల్ల పులులు, పెద్ద పులులు, నీటి ఏనుగులు, కోతులు, ఏనుగులు, పక్షులు, పాములు, జింకలు, జిరాఫీలు తదితర జంతువులు వాటి ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ సందర్శకులను కనువిందు చేశాయి. వివిధ రకాల పక్షులు కిలకిలరావాలతో అలరించాయి. జూలో ఆధునికీకరించిన లవ్ బర్డ్స్ జోన్, దాని ఆనుకుని కొత్తగా నిర్మించిన డక్ యావరీ సందర్శకులను ఆకట్టుకున్నాయి.